ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవి
9866330400

# ప్రజావీక్షణం
దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :261 15 శనివారం ఆగస్టు 2026 పేజీలు : 08 వెల:రూ.2/-
Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari



## విద్యా వ్యవస్థను సమూలంగా
# ప్రక్షాళన...
### చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు

- నర్సరీ నుంచి బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు
- కులరహితంగా అందరికీ ఒకే విద్యకోసం కృషి
- గత ప్రభుత్వం కుల విద్యల పేరుతో విద్యకు దూరం చేసింది
- పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్

హైదరాబాద్,ఆగస్ట్14( ప్రజా వీక్షణం ):

“చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు.” ...మిగతా 2 లో...

## నేరాల స్వరూపం
# మారుతోంది

- సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో అవేర్‌నెస్
- రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన
- డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి



హైదరాబాద్,ఆగస్టు14( ప్రజా వీక్షణం ):

నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ...మిగతా 2 లో...



### సిఎం కనుసన్నల్లో
# నిషేధిత జాబితా

- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శ

హైదరాబాద్,ఆగస్ట్14( ప్రజా వీక్షణం )

:తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## దేశ విభజనతో ఎన్నో జీవితాలు
# చిన్నాభిన్నం...

- పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డేపై మోడీ



న్యూఢిల్లీ,ఆగస్ట్14( ప్రజా వీక్షణం ):

దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు.విభజన కారణంగా నష్ట పోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు.

...మిగతా 2 లో...

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు
### ట్యాంపరింగ్‌కు అవకాశం లేకుండా ఏర్పాటు



సంగారెడ్డి,ఆగస్ట్14( ప్రజా వీక్షణం ):

ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారు తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వచ్చారు. సంగారెడ్డిలో శనివారం పంద్రాగస్ట్ పురస్కరించుకుని సిఎం రేవంత్ రెడ్డి స్మార్ట్ కార్డును పంపిణీ చేయనున్నారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికా రులు కార్డులు అందచేయనున్నారు. సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. స్తాని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలే లబ్దిదారులకు రేషన్ కార్డులుగా ఉపయోగపడుతూ వచ్చాయి. జిరాక్స్ కాగితాలు చినిగిపోతూ ఇబ్బంది పడుతున్న లబ్దిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పంద్రాగస్టు రోజు నుంచి సరికొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ముద్రణ పూర్తి చేసు కున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు.

...మిగతా 2 లో...

## తెలంగాణ పోలీసు శాఖకు
# అరుదైన గౌరవం
### పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు




హైదరాబాద్,ఆగస్ట్14( ప్రజా వీక్షణం ):

తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు.

...మిగతా 2 లో...



# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- పార్టీ వేదికల్లో మాత్రమే చెప్పాలి
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,ఆగస్ట్14( ప్రజా వీక్షణం ):

కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

...మిగతా 2 లో...

## డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్
# గ్లోబల్ సమ్మిట్

- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

2 లో





# బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

హైదరాబాద్,ఆగస్ట్14( ప్రజా వీక్షణం ):

అనారోగ్యంతో మరణించిన తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు పార్థీవ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్ నివాళులు అర్పించిన అనంతరం శోకతప్తులైన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,ఆగస్ట్14( ప్రజా వీక్షణం ):

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్–2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

మొదటిపేజీ తరువాయి

ప్రతి ఏటా స్వాతంత్య్ర దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయని మోదీ పేర్కొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

మొదటిపేజీ తరువాయి

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# నేరాల స్వరూపం మారుతోంది

మొదటిపేజీ తరువాయి

ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన...

మొదటిపేజీ తరువాయి

ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు, డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్–1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిఖజ్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు.

క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందుకే ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా పూలే విధానాలను కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుందన్నారు.

# తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

మొదటిపేజీ తరువాయి

ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు.ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి.ప్రతి ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

# కొత్తపల్లి జంక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థీకరణకు శ్రీకారం

కరీంనగర్: ఆగస్టు 14 ( ప్రజా వీక్షణం )




కొత్తపల్లి జంక్షన్ సిగ్నల్ వ్యవస్థీకరణతో పాటు ఆధునిక హంగులతో అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం రైల్వే, ట్రాఫిక్ శాఖలకు చెందిన అధికారులు, స్టేషన్ అధికారులు లాంఛనంగా జంక్షన్‌ను ప్రారంభించారు. జంక్షన్ అభివృద్ధిలో భాగంగా నూతన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సిగ్నల్ వ్యవస్థను మెరుగుపరిచారు. దీంతో రాత్రివేళల్లో వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలకు మెరుగైన వెలుతురు, రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. జంక్షన్ సుందరీకరణ, లైటింగ్, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కార్మికులు రాత్రింబవళ్లు శ్రమించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈ, సీనియర్ డీఓఎం అధికారులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్, స్టేషన్ మాస్టర్లు తేజ, శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు. కొత్తపల్లి జంక్షన్ నూతన హంగులతో ప్రారంభం కావడం, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సిగ్నల్ వ్యవస్థ, నూతన లైటింగ్ అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ప్రయాణికులు, స్థానిక ప్రజలకు మరింత భద్రత, సౌకర్యం కలుగుతుందని అధికారులు తెలిపారు.




# నేడు అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నిజామాబాద్, ఆగస్టు 14 : ప్రజా వీక్షణం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ నెల 15న (శనివారం) మధ్యాహ్నం రెండు గంటలకు లబ్దిదారులకు ముఖ్య అతిథిగా విచ్చేయనున్న ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రేషన్ కార్డులు కలిగి ఉన్న లబ్దిదారులు, రేషన్ డీలర్లు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పేద కుటుంబాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ వసతి ఉండాలని, వేదిక, సీటింగ్ అరేంజ్ మెంట్, సౌండ్ సిస్టం, ఎల్.ఈ.డీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లను పక్కాగా సరిచూసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

మొదటిపేజీ తరువాయి



స్వాతంత్య్ర దినోత్సవం రోజున సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారం భించిన వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గతంలో దారిద్య రేఖకు దిగువ ఉన్నవారికి తెలుపు రంగు కార్డులు, ఎగువనున్నవారికి గులాబీ రంగు కార్డులు ఉండేవి. గులాబీ రంగు కార్డుదారులకు బియ్యం మినహా ఇతర సరుకులు పంపిణీ చేసేవారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీకి పరిమితం కావడంతో గత ప్రభుత్వం గులాబీ కార్డులను రద్దు చేసింది.ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా ఎలాంటి ట్యాంపరింగ్ చేయడానికి వీలులేని విధంగా ఏటీఎం, పాన్‌కార్డు మాదిరిగా డిజిటలైజేషన్, స్మార్ట్ టెక్నాలజీ ఆధారితంగా పంపిణీ చేసే పీవీసీ కార్డు, చిప్, బార్‌కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి టెక్నాల జీతో స్మార్ట్ రేషన్‌కార్డులు ముద్రించారు. కార్డు స్కాన్ చేయడంతో అందులో ఉన్న కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం వస్తుంది. ఆధునిక భద్రతా ఫీచ ర్లను పొందుపరచి స్మార్డ్ కార్డులు లబ్దిదారులను ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం రోజు నుంచి లబ్దిదా రులకు చేరనున్నాయి. అంతే కాకుండా టీఎస్ఈపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కూడా స్మార్ట్ కార్డు తీసుకునే వీలు కల్పిస్తున్నారు. కొత్తగా అందించే స్మార్ట్ రేషన్ కార్డులు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, రేషన్ కార్డు నంబర్, రేషన్ దుకాణం నంబర్ ముద్రిస్తారు. కార్డు వెనకవైపు కుటుంబ సభ్యుల వివరాల తో పాటు ఇతర అవసరమైన సమాచారాన్ని పొందుపరిచారు.

# సంపాదకీయం

## దేశవిభజన ఒక చీకటి అధ్యాయం !

స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి ప్రక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళు _న్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16–18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

## వెలగపాడులో మొక్కల పంపిణీ కార్యక్రమం...





### పచ్చదనే మన భవిష్యత్తు: టీడీపీ సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు

వెలగపాడు:ఆగష్టు 14(ప్రజా వీక్షణం)

ప్రకృతిని పరిరక్షించడం, భావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం వెలగపాడు పంచాయతీ పరిధిలో శుక్రవారం నాడు నిర్వహించిన బృహత్తర మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని శీలం వెంకటేశ్వరరావు ఉద్ఘాటించారు. నేడు మనం నాటే ప్రతి చిన్న మొక్క రేపటి తరాలకు ప్రాణాధారమైన స్వచ్ఛమైన గాలిని, ఆయువును ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామాన్ని హరిత వెలగపాడుగా తీర్చిదిద్దేందుకు పార్టీ శ్రేణులు, గ్రామ యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడంతో సరిపెట్టకుండా, అవి పెద్దవయ్యే వరకు సంరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు గ్రామస్థులు అందరూ సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది, మహిళలు మరియు కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ఇంటికొక మొక్క చొప్పున స్వీకరించారు.

## రాజా హాస్పిటల్స్ లో నేడు ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు







జీలుగుమిల్లి మరియు ధర్మాగూడెం, జంగారెడ్డిగూడెం పట్టణ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

### తెలిపిన వైద్యులు

జంగారెడ్డిగూడెం:ఆగష్టు 14(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలోని రాజా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఎనభై వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని హాస్పిటల్ వైద్యులు ప్రకటించారు. ఈ సందర్భం గా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వైద్యులు డాక్టర్ రాజేష్ రెడ్డి ముప్పన మరియు డాక్టర్ సుష్మ ముప్పన మాట్లాడుతూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ రెడ్డి ముప్పన జనరల్ మరియు లాపరోస్కోపిక్ సర్జన్ మాట్లాడుతూ, మన దేశ స్వాతంత్ర్య వేడుకలను ఈ రోజు ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, మనమంతా స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమర యోధులను ఎప్పుడూ స్మరించుకోవాలని తెలిపారు. అలాగే వైద్య రంగంలో మేము నిరంతరం మెరుగైన సేవలు అందిస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడటమే మా ప్రధాన ధ్యేయమని ,జీలుగుమిల్లి మరియు ధర్బగూడెం ప్రాంత ప్రజలకు ఎల్లప్పు డూ మెరుగైన వైద్యం అందించే ందుకు రాజా హాస్పిటల్స్ ముందుం టుందని అన్నారు. అదే విధంగా డాక్టర్ సుష్మ ముప్పన జనరల్ మరియు షుగర్ వైద్య నిపుణులు, గైనకాలజిస్ట్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం మనందరికీ ఎంతో గర్వకారణమని, స్వతంత్ర భారతదేశంలో మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ఆరోగ్యపరంగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్య సేవలను అందించడానికి మేము నిరంతరం సిద్ధంగా ఉన్నామని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, దేశాభివృద్ధిలో భాగస్వాము లు కావాలని పిలుపునిచ్చారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ మరియు న్యాయవాది కురగంటి రాంబాబు

నందిగామ, ఆగస్టు 14 (ప్రజా వీక్షణం):

ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ మరియు నందిగామ బార్ అసోసియేషన్ ప్యానల్ అడ్వకేట్ కురగంటి రాంబాబు రాష్ట్ర ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని "అనే నేను - పార్ట్నర్స్ ఇన్ నేషనల్ బిల్డింగ్స్" అనే థీమ్‌తో నిర్వహిస్తున్న కార్యక్రమంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో దేశభక్తి, బాధ్యత, సృజనాత్మక ఆలోచనలు మరియు భవిష్యత్తు లక్ష్యాల పట్ల స్పష్టతను పెంపొందించడమేనని రాంబాబు తెలిపారు. రాష్ట్ర మరియు దేశ అభివృద్ధిలో తాము ఎలా భాగస్వాములు కావాలనుకుంటున్నారో విద్యార్థులు తమ సొంత మాటల్లో వ్యక్తపరిచే అవకాశం ఈ వేదిక కల్పిస్తుందన్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తులో తాను ఏమి కావాలనుకుంటున్నాడు, తన లక్ష్యం ఏమిటి, రాష్ట్రం మరియు దేశ అభివృద్ధికి తాను ఎలా సహకరించాలనుకుంటున్నాడు అనే విషయాలపై విద్యార్థుల ఆలోచనలు స్వతంత్రంగా మరియు సృజనాత్మకంగా ఉండేలా ప్రోత్సహించాలని ఆయన అభిప్రాయప డ్డారు. విద్యార్థులందరి తోనూ ఒకే విధమైన రొటీన్ ప్రతిజ్ఞ చెప్పించకుండా, ప్రతి ఒక్కరూ స్ఫూర్తిదాయకంగా మాట్లాడేలా చేయడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. "అనే నేను" అంటే కేవలం ఒక ప్రతిజ్ఞ మాత్రమే కాదని, దేశ నిర్మాణంలో తన వంతు పాత్ర ఏమిటనే ఆలోచనను ప్రతి విద్యార్థిలోనూ కలిగించే ఒక గొప్ప వేదిక అని రాంబాబు స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి తన సొంత కల, లక్ష్యం, బాధ్యత మరియు దేశానికి చేయాలనుకునే సేవను స్వేచ్ఛగా



వ్యక్తపరిచేలా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి పౌరుడు దేశం కోసం ఎంతో కొంత సేవ చేయాలని, తన వంతు బాధ్యతగా ఇతరులకు సహాయపడాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# జీలుగుమిల్లిలో నరకయాతన అనుభవిస్తున్న చంద్ర రాజేశ్వరి కాలనీవాసులు!

సొంత ఖర్చులతో దారి బాగుచేసుకున్నా తప్పని తిప్పలు .. శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ఆర్జీ

జీలుగుమిల్లి ఆగస్టు 14:(ప్రజా వీక్షణం)





ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండల కేంద్రంలోని చంద్ర రాజేశ్వరి కాలనీ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడ ప్రధాన సమస్య ఏమిటంటే.. జీలుగుమిల్లి సెంటర్ మరియు మెయిన్ రోడ్డు (ప్రధాన రహదారి) పై నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగునీరంతా నేరుగా ఈ కాలనీ లోకే వచ్చి చేరుతోంది. దీనివల్ల కాలనీ వీధులన్నీ మురుగునీటితో నిండిపోవడమే కాకుండా, కొద్దికొద్దిగా స్థానికుల ఇళ్లలోకి కూడా నీరు చేరుతోంది.కాలనీలోని గోడల పక్కన ఉండే దారుల్లో ఈ నీరంతా ఎప్పుడూ నిలవ ఉండటం వల్ల అక్కడ విపరీతంగా పిచ్చిమొక్కలు, గడ్డి, పొదలు దట్టంగా పెరిగిపోయాయి. గతంలో ఈ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు కాలనీ ప్రజలందరూ కలిసి, తమ సొంత డబ్బులు ఖర్చుపెట్టి ఆ దారిని బాగుచేయించుకున్నారు. అయినప్పటికీ, మెయిన్ రోడ్డు నుంచి వచ్చే మురుగునీరు ఆగకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.ఇళ్ల చుట్టూ, వీధుల్లో నీరు నిలవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే దారి పక్కన పొదలు పెరగడంతో రాత్రి పూట పాములు, తేళ్లు వంటి విషకీటకాల భయం వెంటాడుతోందని వాపోతున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి.. మెయిన్ రోడ్డు నుంచి కాలనీలోకి నీరు రాకుండా శాశ్వత డ్రైనేజీ నిర్మించాలని, నిలిచిన నీటిని తొలగించి పిచ్చిమొక్కలు నరికించాలని, కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లి తమను కాపాడాలని చంద్ర రాజేశ్వరి కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.

# స్వాతంత్రం దినోత్సవ సందర్భంగా నేడు విప్లవాత్మక పథకాలు చట్టాలు.. ప్రారంభం..

## డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్

దేవరకద్ర ఆగస్టు 14 ( ప్రజా విక్షణం )

80 స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా శనివారం తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజాపాలన ప్రభుత్వం కొన్ని విప్లవాత్మక పథకాలు చట్టాలు ప్రారంభోత్సవం చేయడం జరుగుతుం దని జిల్లా డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆగస్టు 15న మన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా నడుస్తున్న 'ప్రజా ప్రభుత్వం' కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, రాష్ట్రంలోని పేదలు, విద్యార్థులు మరియు కష్టపడే ప్రతి శ్రామికుడికి 'సామాజిక మరియు ఆర్థిక స్వాతంత్ర్యం' కల్పించే చారిత్రాత్మక నిర్ణయాలను అమలులోకి తెస్తోంది."విప్లవాత్మక సంక్షేమం 1. 1.05 కోట్ల క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చారిత్రాత్మక ఘట్టం: ఆగస్టు 15న సీఎం రేవంత్ రెడ్డి గారు సంగారెడ్డి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల డెబిట్ కార్డ్ సైజ్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని అధికారికంగా ప్రారంభిస్తున్నారు. మధ్యాహ్నం 2:00 నుండి 4:00 గంటల మధ్య: రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాలు మరియు 33 జిల్లాల కేంద్రాల్లో ఒకేసారి ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో ఈ పంపిణీ జరుగుతుంది. ప్రయోజనాలు: పాత పేపర్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్ క్యూఆర్ కోడ్ ) ఉన్న ఆధునిక లామినేటెడ్ కార్డులను అందిస్తున్నాం. దీనిద్వారా రాష్ట్రంలో 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు ఉచితంగా ప్రతీ నెలా 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం పారదర్శకంగా అందుతాయి. బియ్యం సబ్సిడీ మరియు సేకరణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా ఏకంగా రూ. 34,000 కోట్లను కేటాయిస్తోంది. తెలంగాణ గిగ్ & ప్లాట్‌ఫామ్ వర్కర్ల భద్రతా చట్టం – 2026 (గిజ్ వర్కర్స్ యాక్ట్ ) దేశంలోనే సరికొత్త చరిత్ర: స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబెర్, జెప్టో వంటి యాప్-ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న 10 లక్షల మంది గిగ్ కార్మికులకు సమగ్ర భద్రత మరియు హక్కులు కల్పించే చట్టం ఈ ఆగస్టు 15 నుంచే అమలులోకి వస్తోంది. చట్టంలోని కీలక నిబంధనలు:ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు: కార్మికుల సంక్షేమాన్ని పర్యవేక్షించడానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు. యునిక్ ఐడీయూనిక్యూ ఐడి ప్రతీ గిగ్ వర్కర్‌కు ఉచిత శాశ్వత గుర్తింపు కార్డు. ఉచిత బీమా ౚ సంక్షేమ నిధి: కార్మికుల జీతాల నుండి పైసా కోత విధించకుండా, కంపెనీలు చెల్లించే ప్రతి లావాదేవీ రుసుము (అగ్రిగేటర్ ఫీ ) ద్వారానే హెల్త్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా మరియు మాతృత్వ ప్రయోజనాలు అందిస్తాం.అకారణ తొలగింపులపై నిషేధం: కంపెనీలు అకారణంగా యాప్‌లో అకౌంట్లను బ్లాక్ చేయకుండా నిరోధిస్తూ, ఏవైనా సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కరించే గ్రీవెన్స్ వ్యవస్థను తీసుకొచ్చారు.విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే నేరుగా ఫీజు రీయింబర్స్మెంట్ విద్యా సంవత్సరం ముగిసే వరకు ఆగకుండా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 1 లక్ష మందికి పైగా ఎస్సీ , ఎస్టి , బీసీ , మైనారిటీ మరియు ఇబీసీ విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే నేరుగా ఫీజు రీయింబర్స్మెంట్ ౚ స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేసే ప్రక్రియ ప్రారంభమవుతోంది. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల గడువు విస్తరణ పట్టణ పేదల సొంతింటి కలను నిజం చేసే ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ (హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 7,340 డి-లక్స్ ఫ్లాట్లు) దరఖాస్తు గడువు ప్రజల సౌకర్యార్థం ఆగస్టు 15 వరకు పొడిగించబడింది.బిఆర్ఎస్, బిజెపి నాయకులకు మా సవాల్:"గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కేవలం మాటలు, ప్రకటనలకే పరిమితమైన పేదల సంక్షేమాన్ని. ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం చేతల్లో చూపిస్తోంది. పదేళ్లుగా పేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతారు? అని వారు ప్రశ్నించారు.రాహుల్ గాంధీ దేశానికి ఇచ్చిన గ్యారెంటీలను, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ నేలపై అక్షరాలా అమలు చేసి చూపిస్తున్నాం. ఈ ఆగస్టు 15 తెలంగాణలోని ప్రతీ పేద కుటుంబానికి, ప్రతీ కష్టజీవికి నిజమైన స్వేచ్ఛా సంబరం!" అని వారు అన్నారు.




# ప్రతి ఒక్కరూ సామజిక బాధ్యతగా మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలి

బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు పిలుపు

బాపట్ల : ఆగస్టు 14 ( ప్రజా విక్షణం )

శుక్రవారం బాపట్ల పట్టణంలోని వివేకానంద కాలనీ సచివాలయం దగ్గర స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి, దేశ నిర్మాణ నిబద్ధతకు గుర్తుగా బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మొక్కలు నాటారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ..... స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, రాబోయే తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి,వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్.డి.ఓ.హరి కుమార్,మున్సిపల్ కమిషనర్ మామిళ్ళపల్లి హాసిని , తెలుగుదేశం,జనసేన,బీజేపీ నాయకులు కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



# సర్వశిక్ష అభియాన్ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటి అధికారులు మన్ననలు పొందిన రజని

బాపట్ల : ఆగస్టు 14 (ప్రజా విక్షణం)

80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రముఖ సంఘ సేవకురాలు రజని బాపట్ల సర్వ శిక్ష అభియాన్ కార్యాలయం వద్ద మూడు రకాలైన పళ్ళ మొక్కలను (మొత్తం ఆరు మొక్కలను) బహూకరించి స్వయంగా సదరు కార్యాలయం నందు నాటి అధికారుల మనలను పొందటమే కాకుండా,సర్వ శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు, వారి సిబ్బంది రజని శాలువాతో సత్కరించి,అమ్మ సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర పుస్తకమును బహూకరించారు.రజని





సమకూర్చిన పండ్ల మొక్కల ద్వారా పర్యావరణ పరిరక్షణ, కాకుండా మొక్కల ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని రజనికి అభినందనలు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలియజే శారు.

# స్వాతంత్ర దినోత్సవానికి అన్ని ఏర్పాటు పూర్తి..

దేవరకద్ర ఆగస్టు 14 ప్రజావిక్షణం

మున్సిపాలిటీ కేంద్రంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుక సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలో అటు సిబ్బంది ఉపాధ్యాయులు అన్నిఏర్పాటు చేశారు. జెండాకు సంబంధించి దగ్గర ఉండి దానికి తుది మెరుగులు దిద్దారు.



# ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

## మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్‌తో కలిసి స్పెషల్ పీజీఆర్ఎస్'లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే

బాపట్ల : ఆగస్టు 14 (ప్రజా విక్షణం )

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకుని, వేగంగా పరిష్కరించాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం చేపట్టిన "ఒక నెల – – ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు నిర్వహించిన 'స్పెషల్ పీజీఆర్ఎస్' (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని బాపట్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, ఆయా సమస్యల తీవ్రతను అక్కడికక్కడే అధికారులకు వివరించి, నిబంధనల ప్రకారం నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా పాలనను ప్రజల ముంగిటకు చేర్చడమే ప్రభుత్వ ఉద్దేశమని, ఏ ఒక్క అర్జీదారుడూ నిరాశతో వెనుదిరగకూడదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో ౚ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఆర్డీవో పి. హరి కుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం. హాసిని, తహశీల్దార్ సలీమా, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. విజయమ్మలతో పాటు వివిధ శాఖల పీడీలు బి. సింగయ్య (డీఆర్డీఏ), విజయలక్ష్మి (డ్వామా), ఆనంద సత్యపాల్ (మెప్మా), రాధామాధవి (స్త్రీ శిశు సంక్షేమం), వెంకటేశ్వరరావు (గృహ నిర్మాణం), విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, వ్యవసాయ అధికారిణి ఏ. లక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం కారుణ్యశ్రీ, ల్యాండ్ సర్వే ఏడీ సాంబశివరావు, డీటీవో ఎల్. ప్రభాకరరావు, డీఐవో కోదండరామ్, బీసీ వెల్ఫేర్ డీడీ శివలీల, జిల్లా ఫైర్ ఆఫీసర్ వినయ్, ఆర్టీసీ ఆర్ఎం విమల మరియు డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# ఏలూరు జిల్లాలో అత్యంత వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు!





- ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా కవాతు రిహార్సల్స్
- ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు జారీ చేసిన జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్

ఏలూరు ఆగస్టు 14(ప్రజా వీక్షణం)

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏలూరు జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు అన్నీ పూర్తవుతున్నాయి. ఇందులో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ వేడుకలను ఎలాంటి లోపాలు లేకుండా విజయవంతం చేయడానికి, ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ శుక్రవారం నాడు నేరుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పోలీసుల కవాతు రిహార్సల్స్‌ను ఆయన దగ్గరుండి చూశారు. ఈ సందర్భంగా వేడుకలకు వచ్చే ముఖ్య అతిథులు మరియు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, పరేడ్ మరియు దేశభక్తిని తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలను అందరూ సమన్వయంతో విజయవం తం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రౌండ్ చుట్టూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశభక్తిని చాటే ఈ గొప్ప వేడుకలను ఏలూరు జిల్లాలో చాలా విజయవం తంగా నిర్వహించాలని, అధికారులు అందరూ తమకు అప్పగించిన బాధ్యత లను బాధ్యతాయుతంగా నిర్వర్తిం చాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి తొలి శ్రావణ శుక్రవారం పూజలు....

దేవరకద్ర ఆగస్టు 14 ప్రజా విక్షణం



మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో తొలి శ్రావణ శుక్రవారం వేడుకలను భక్తిశ్రద్ధలతో మహిళలు పూజలు చేశారు. ఆలయ అర్చకులు హరి శంకర శర్మ,అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, కుంకుమార్చ నలు నిర్వహించా రు. శ్రావణ మాసం తొలి శుక్రవారం కావడంతో ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పసుపు, కుంకుమ, పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అండ

బాపట్ల : ఆగస్టు 14 ( ప్రజా వీక్షణం )

నిరుపేదలకు ఎటువంటి కష్టం వచ్చినా ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సహాయం అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటుందని ఆర్గనైజేషన్ సలహాదారు నందిపాటి శ్రీరామ్ సునీల్ అన్నారు.నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటేశ్వర్లు నిత్యం కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఆకస్మికంగా గుండెపోటుకు గురై రోడ్డుపై కుప్పకూలిపోయారు.వెంటనే కుటుంబ సభ్యులు,స్థానికులు ఆయనను ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది.వెంకటేశ్వర్లుకు భార్యతో పాటు నాలుగో తరగతి చదువుతున్న కుమార్తె ఉంది.కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఆయన మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది.ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు సహాయం కోరగా ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు స్పందించి శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ సభ్యుడు నందిపాటి శ్రీరామ్ సునీల్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ ఆర్గనైజేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తమ వంతు సహకారం అందించడం సభ్యుల యొక్క ప్రధాన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు,బలరాం, కన్న బాబు,అజయ్ పాల్గొన్నారు.



# కవాతు రిహార్సల్ ప్రదర్శన అద్భుతంగా నిర్వహించారు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పోలీస్ కవాతును మరింత అత్యుత్తమంగా నిర్వహించాలి

వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి

జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఐపీఎస్









బాపట్ల : ఆగస్టు 14 ( ప్రజా వీక్షణం )

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో నిర్వహించే పోలీస్ కవాతును అత్యంత సుందరంగా, శోభాయమానంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్,ఐపీఎస్ పోలీస్ అధికారుల కు, సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ కవాతు రిహార్సల్ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై కవాతు రిహార్సల్‌ను పరిశీలించారు.అనంతరం కవాతు నిర్వహించిన పోలీస్ అధికారులు,సిబ్బందిని అభినందిస్తూ వేడుకల రోజున తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై వారికి దిశానిర్దేశం చేశారు.ఈ రిహార్సల్‌కు ఏఆర్ డీఎస్పీ పి. కృష్ణంరాజు పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించి కవాతును నిర్వహించా రు. మైదానానికి చేరుకున్న ఎస్పీ ముందుగా సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పరేడ్ పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల కవాతును నిశితంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పెరేడ్‌లో పాల్గొన్న సిబ్బందికి, అధికారులకు కవాతును మరింత మెరుగ్గా నిర్వహించడానికి పలు విలువైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ,కవాతు రిహార్సల్ ప్రదర్శన చాలా సుందరంగా జరిగిందని కొనియాడారు.స్వాతంత్ర్య దినోత్సవం నాడు కవాతులో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ, ఐక్యతతో మరింత ఆకట్టుకునేలా ప్రదర్శన ఇవ్వాలని తెలిపారు. పోలీస్ జాగిలాల విన్యాసాలు చాలా బాగున్నా యని,ఇవి ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తాయని పేర్కొన్నారు.అలాగే శకటాలు సరైన వరుస క్రమంలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని,ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి విచ్చేసే అతిథు లు, ప్రజాప్రతినిధు లు,ప్రజలు ,విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుం టూ తగిన ఏర్పాట్లు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు.మైదానంలో మరియు పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్,ఏఆర్ డీఎస్పీ పి.కృష్ణంరాజు,ఎస్.బి. ఇన్స్పెక్ట ర్ జి. నారాయణ,ఆర్.ఐ.లు షేక్. మౌలుద్దీన్,ప్రదీప్ కవాతు నిర్వహించే పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నా రు.

# ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి వేగవంతం

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజా వీక్షణం)

కూటమి ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యంతో నియోజకవర్గంలో అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు . తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ కాలనీలో దాతల సహకారంతో అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తే ప్రభుత్వంపై భారం తగ్గడంతో పాటు విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించవచ్చన్నారు. హౌసింగ్ బోర్డులోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పార్క్‌ను, పిల్లల ఆట వస్తువులను ఆయన పరిశీలించారు.పాఠశాలలో పార్క్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆట వస్తువులు అందించిన అంజన హరికృష్ణ, ఆయన మిత్రబృందం, ఇంజనీర్ ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న పీ4 కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించడం అభినందనీయమన్నారు.ప్రభుత్వం అన్ని పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే ఎక్కువ సమయం పడుతుందని, ప్రజలు ముందుకొచ్చి తమ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తే ప్రభుత్వ భారం తగ్గుతుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టే వారిని ప్రభుత్వం గుర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దుర్గాప్రసాద్‌ను పీ4లో సభ్యుడిగా గుర్తించి ఆయన వివరాలను ప్రభుత్వానికి పంపిస్తామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పిఎంకె జ్యోతితో పాటు ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# దేశభక్తి నినాదాలతో హోరెత్తిన కంచికచర్ల... ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ!

ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నేతృత్వంలో వైభవంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

కంచికచర్ల, ఆగస్టు 14 (ప్రజా వీక్షణం):







స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల గ్రామంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక శాసనసభ్యురా లు (ఎమ్మెల్యే) తంగిరాల సౌమ్య నేతృత్వంలో జరిగిన ఈ భారీ జాతీయ జెండా ర్యాలీ దేశభక్తి నినాదాలతో హోరెత్తింది.ఈ కార్యక్రమంలో విద్యార్థు లు, కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉత్సాహం గా పాల్గొన్నారు. చేతుల్లో త్రివర్ణ పతాకాలు పట్టుకుని వారు నిర్వహిం చిన ఈ ర్యాలీ స్థానికంగా దేశభక్తి వాతావరణాన్ని తలపించింది. టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బంక్ సెంటర్ వరకు కోలాహలంగా సాగింది. దారి పొడవునా 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలు మిన్నంటాయి.

ర్యాలీ అనంతరం బంక్ సెంటర్‌లో నిర్వహించిన మానవహారంలో ఎమ్మెల్యే సౌమ్య స్వయంగా పాల్గొని అందరిలో నూ ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశభక్తిని మరియు జాతీయ సమైక్యతను చాటాల ని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ ఆటోనగర్‌లో వైభవంగా టీడీపీ నూతన జిల్లా కార్యాలయ శంకుస్థాపన!

విజయవాడ ఆగస్టు 14(ప్రజా వీక్షణం)

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఆటోనగర్‌లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నూతన జిల్లా కార్యాలయ నిర్మాణ పనులు శుక్రవారం అత్యంత అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పార్టీ భవిష్యత్తును మరింత బలోపేతం చేసే ఈ శంకుస్థాపన మహోత్సవంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) తదితర ప్రముఖ నాయకులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రసంగిస్తూ.. జిల్లా స్థాయిలో ఒక శాశ్వత కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల పార్టీకి ఒక బలమైన వేదిక దొరికినట్లవుతుందని అన్నారు. దీనిద్వారా పార్టీ కార్యకలాపాలు మరింత జోరందుకోవడంతో పాటు, కార్యకర్తలతో నిరంతరం సమన్వయం చేసుకోవడానికి మరియు ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి పర్యవేక్షణ మరింత పటిష్ఠంగా మారుతుందని ఆమె వివరించారు. "కార్యకర్తలే పార్టీకి అసలైన నిజమైన బలం, వారందరి సమష్టి కృషితో తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో తిరుగులేని విధంగా మరింత ముందుకు తీసుకెళ్తాం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ శుభకార్యక్రమంలో భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై వేడుకను విజయవంతం చేశారు.



## మత్స్యకారులు ప్రత్యామ్నాయ వ్యాపారాలపై దృష్టి సారించాలి

### ఫిషరిస్ డిపార్ట్మెంట్ కో - ఆపరేటీవ్ సొసైటీ జేడీ శ్రీనివాస్ నాయక్

బాపట్ల: ఆగష్టు 14 ( ప్రజా వీక్షణం )

మత్స్యకారులు చేపల వేటతో పాటు అదనపు ఆదాయ మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ కో–ఆపరేటివ్ సొసైటీ జేడీ శ్రీనివాస్ నాయక్ సూచించారు. జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏఎఫ్‌సీ,ఓఎఫ్‌సీ,బీబీఓ టీం సహకారంతో శుక్రవారం బాపట్ల పట్టణం బెస్తపాలెంలో మత్స్యకారులకు వ్యాపార అభివృద్ధి,ఐటీ స్కిల్స్ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ.....కేంద్ర ప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల సహకారంతో మత్స్యకారులకు వివిధ పథకాల కింద సబ్సిడీ రుణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బోట్లు కొనుగోలు చేసుకునే మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం 40 శాతం వరకు సబ్సిడీ అందించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి మత్స్యకారుడు తమ బోట్లను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని,గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. ఐటీ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు చేపల వేటకు అనుబంధంగా ఇతర వ్యాపార కార్యకలాపాలను చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎఫ్‌సీ ఆక్వా రీజనింగ్ ఆఫీసర్ కే.గంగాధర్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ చాప సోమయ్య,ఏఎఫ్‌సీ ఐటీ స్కిల్ ప్రతినిధి అబ్దుల్ నవీన్,ఫిషరీస్ ఉమెన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలు గొల్ల కళ్యాణి,ఆక్వా అడ్వాంటేజ్ ప్రతినిధి కే.షణ్ముఖతో పాటు పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.




## కళాశాలలో ప్రపంచ అవయవ దాన దినోత్సవం వేడుకలు..

దేవరకద్ర ఆగస్టు 14 ప్రజావి క్షణం

దేవరకద్ర మండల పరిధిలోని చౌదర్‌పల్లిలోని విశ్వేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం'ప్రపంచ అవయవ దాన దినోత్సవం' పురస్కరించుకుని అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయమూర్తి ఇందిర (లీగల్ సర్వీసెస్ అథారిటీ), డీఎండహెచ్ఓ డాక్టర్ ఎ. శ్రీనివాసులు, జనరల్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా , డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ శంకర్ (పో మహాన్ ), డాక్టర్ రాజు (డిఎనమో , పో లేప్రోజీ ), పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర , దేవరకద్ర ఎస్సై భాస్కర్ రెడ్డి, మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు కలిసి అవయవ దానంపై ప్రతిజ్ఞ స్వీకరించారు.




## ఫలాల అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

బాపట్ల : ఆగష్టు 14 ( ప్రజా వీక్షణం )

శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా బాపట్ల పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని వివిధ రకాల ఫలాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బాపట్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్తమాసు సత్యనారాయణ మాట్లాడుతూ శ్రావణమాసంలో వరాలు కురిపించే కన్యకా పరమేశ్వరి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయని అన్నారు. శ్రావణమాసంలోని ప్రతి శుక్రవారం అమ్మవారిని వివిధ రకాల ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఫలాల అలంకరణతో పాటు రానున్న శుక్రవారాల్లో గాజుల అలంకరణ,పూల అలంకరణ, గంధం అలంకరణ తదితర ప్రత్యేక అలంకరణలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కే.సురేష్,భక్తులు పాల్గొన్నారు.



## 80 అడుగుల జాతీయ జెండాతో ఘనంగా స్వాతంత్ర్య ర్యాలీ

నందిగామ, ఆగస్టు 14 (ప్రజా వీక్షణం):

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం ఘనంగా జాతీయ జెండా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి 80 అడుగుల జాతీయ జెండాను చేతబట్టి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఉత్సాహంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆళ్ళ రాంబాబు మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాల ఫలితమే మనకు లభించిన స్వాతంత్ర్యమని అన్నారు. దేశభక్తి, జాతీయ భావాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించుకోవాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపైనా ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేశారు.




## గోపవరంలో ఘనంగా 'కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం'

### - ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

కైకలూరు ఆగష్టు 14(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం, కైకలూరు మండలం గోపవరం గ్రామంలోని 163వ బూత్‌లో ఆగస్టు 14, 2026 నాడు "కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం" – అభివృద్ధి, సంక్షేమం – ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు మరియు టిడిపి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, విద్య, ఐ.టి, మానవవనరుల శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారి సమర్థవంతమైన సారథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది. క్లస్టర్–5 కన్వీనర్ పోలవరపు లక్ష్మీరాణి పర్యవేక్షణలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పి. రాధకృష్ణ, యూనిట్–21 కో–కన్వీనర్ వీరాబత్తిన సుధ, 163 టిడిపి బూత్ కో–కన్వీనర్ పట్నాల శ్రీనివాసరావు, గ్రామ టిడిపి అధ్యక్షులు పోలవరపు సుబ్బారావు, వీరవల్లి దానయ్య తదితర ప్రముఖులు గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరుగుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను (పాంప్లెట్లను) ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందజేశారు. నాయకులు మరియు కార్యకర్తల ఉత్సాహభరిత నడుమ ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## హర్ ఘర్ తిరంగా ఇంటిపై ఎగుర వేసిన త్రివర్ణ పతాకం..

దేవరకద్ర ఆగస్టు 12 ప్రజా విక్షణం

భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేవర కద్ర నియోజకవర్గ కేంద్రంలోని తన నివాసం పై త్రివర్ణ పతాకాన్ని ఎగర వేసిన రైల్వే స్టేషన్లో బిజెపి నాయకుడు సత్యనారాయణ ఇంటిపై జెండాను ఎగురవేశారు. 150 ఏళ్లుగా "వందే మాతరం" నినాదం దేశ ప్రజల హృదయాల్లో జాతీయ స్ఫూర్తిని రగిలిస్తోంది. ఈ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతి వీధిలో, ప్రతి ఇంటిలో ప్రతిధ్వనించేలా దేవరకద్ర నియోజకవర్గం మొత్తం హార్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని ఆయన కోరారు.



## మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావును పరామర్శించిన ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాలదేవి

### రాజమండ్రిలోని గోరూరు శ్రీనివాస్ ఆసుపత్రిలో ప్రత్యేక పరామర్శ

### ఆరోగ్య పరిస్థితిని, చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్న గంజి మాలదేవి

కొవ్వూరు / రాజమండ్రి:ఆగష్టు 14(ప్రజా వీక్షణం)

కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మరియు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావుని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాలదేవి శుక్రవారం ఉదయం ఘనంగా పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం తలారి వెంకట్రావు కి రోడ్డు ప్రమాదం (యాక్సిడెంట్) జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, రాజమండ్రిలోని ప్రసిద్ధ గోరూరు శ్రీనివాస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట్రావుని ఆమె స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా గంజి మాలదేవి తలారి వెంకట్రావుని ఆప్యాయంగా పలకరించారు. అలాగే ప్రమాదం జరిగిన తీరును, ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను ఆసుపత్రి వైద్యులను అడిగి సమగ్రంగా తెలుసుకున్నారు. వెంకట్రావు ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే పూర్తిగా కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు మరియు వెంకట్రావు అభిమానులు పాల్గొని, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందుకోవాలని భగవంతుడిని ప్రార్థించారు.




## టీ. నరసాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీసుల అవగాహన సదస్సు

### మహిళల భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై ప్రత్యేక దృష్టి

టి. నరసాపురం:ఆగష్టు 14(ప్రజా వీక్షణం)

మహిళలు మరియు పిల్లల రక్షణ అందరి బాధ్యత అని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి సీఐ యాదగిరి స్పష్టం చేశారు. అలాగే టి. నరసాపురం మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు ఉపాధ్యాయుల కోసం, జీలుగుమిల్లి సీఐ యాదగిరి అలాగే టీ. నరసాపురం మండల ఎస్ఐ జయబాబు కలిసి టీ. నరసాపురంలో ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు లేదా చిన్నారులపై ఎక్కడైనా వేధింపులు జరిగినా, దాడులు జరిగినా, లేదా ఏవైనా అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ కూడా ఓటీపీ, పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు మరియు వ్యక్తిగత సమాచారాన్ని చెప్పకూడదని తెలిపారు. సామాజిక మాధ్యమాలను చాలా జాగ్రత్తగా వాడాలని, ఒకవేళ సైబర్ మోసం జరిగితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని కోరారు. అలాగే పిల్లలపై లైంగిక వేధింపులు జరిగినా లేదా వారిని దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిసినా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తల మీద ఉంటుందని పోక్సో చట్టం గురించి వివరించారు. పోలీసులు మరియు ప్రజల మధ్య అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక వారధిలా పనిచేయాలని, తమ పరిధిలోని మహిళలకు మరియు పిల్లలకు భద్రతా నియమాలపై ఎప్పుడూ అవగాహన కల్పిస్తూ ఉండాలని పోలీసు అధికారులు కోరారు.



ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS 7

15 శనివారం ఆగస్టు 2026

www.prajaveekshanam.in

# పేద మహిళకు బియ్యం సాయం

**బాపట్ల : ఆగస్టు 14 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కర్లపాలెం పంచాయతీ పాతూరు కు చెందిన ఒక నిరుపేద మహిళకు ఫౌండేషన్ ప్రెసిడెంట్ పఠాన్ అహ్మద్ బాష 10 కేజీల బియ్యంను అందజేశారు. ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం లు,నిత్యావసర సరుకులు,దుప్పట్లు,అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్ధిక చేయూత అందించడం జరుగుతుందన్నారు. దాతలు,సభ్యుల సహకారంతో క్రమం తప్పకుండా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ వలి రిటైడ్ ఆర్మీ,మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్. బాష ,షేక్. ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



# ఇండియన్ రెడ్ క్రాస్ భవనం నందు ఉచిత హోమియో వైద్య శిబిరం

**బాపట్ల : ఆగస్టు 14 ( ప్రజా వీక్షణం )**

"శుక్రవారం హోమియో" రెడ్ క్రాస్ భవనమందు ఉచిత హోమియో వైద్య శిబిరము అనేక మందికి వైద్య సహాయం అందిస్తోంది. ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్య శాల వైద్యులు డాక్టర్ డి చంద్రశేఖర్, జిల్లెళ్ళమూడి ప్రభుత్వ వైద్య శాల వైద్యులు డాక్టర్ భువనేశ్వరీ అనేక రుగ్మతలతో వచ్చిన వారికి హోమియో వైద్య ము పై అవగాహన కల్పిస్తూ, మందుల పనితీరును వివరిస్తూ,ఉచితంగా మందులు అందించటం వలన ఈ సేవలు అనేక మంది పొందటమేకాక తోటి వారిని తీసుకువచ్చి సలహాలు అందుకోవడం జరుగుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలందించే హోమియో మీద డాక్టర్లు నమ్మకం కలిగించారు. ఉచిత వైద్య శిబిరము ను అందుబాటులోకి తెచ్చిన జిల్లా రెడ్ క్రాస్ ను అభినందించి ఆయుష్ శాఖ ఆయుర్వేద,యునానీ లపై ప్రజలకు గల అపోహలు పోగొట్టి వాటినీ అందుబాటులోకి తేవాలని రెడ్ క్రాస్ ను కోరారు. ఈ శిబిరం కు రాజేష్, నవనీతం,ప్రియాంక సహకరించారు.




# వీరప్పయ్య ఆలయంలో అఖండ భజన..

**దేవరకద్ర. ఆగస్టు 14 ప్రజా విక్షణం**



దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఉన్న శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా అఖండ దీపారాధన, మరియు భజన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రావణమాసంలో ప్రతి సంవత్సరం స్వామివారి ఆలయంలో 41 రోజులపాటు అఖండ దీపారాధన పెట్టడం అనావాతిగా వస్తున్నది అని అర్చకులు తెలిపారు. దీపారాధన భజన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగానే శ్రావణమాసం రెండవ రోజు శుక్రవారం ఆలయంలో శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు అలంకరణ వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి . ఆలయంలో అఖండ దీపారాధన వెలిగించరు. భజన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ దేవస్థానం ఈవో శివానంద చారి, లక్ష్మీనారాయణ చారి, నర్సింలు, ఆంజనేయులు, పూజారులు నాగరాజు, నాగభూషణ్ , భజన భక్తులు, నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# పుట్టగొడుగుల్లా పుట్టుకొని వస్తున్న బెల్టుషాపులు..!

## విచ్చలవిడిగా మద్యం విక్రయాలు.. భయాందోళనలో ప్రజలు..

## పట్టించుకోని ఎక్సైజ్ శాఖ.. అధికారుల నిఘా ఎక్కడంటూ ప్రశ్నిస్తున్న స్థానికులు

**దేవరకద్ర , ఆగస్టు 14 ప్రజా విక్షణం**

దేవరకద్ర మండలంలో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలువెత్తుతున్నాయి. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, జనావాస ప్రాంతాలు, రహదారుల వెంట అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి భయం లేకుండా కిరాణం షాపుల్లో కూడా మద్యం పెట్టి అమ్ముతున్నారు, బెల్టుషాపుల నిర్వాహకులు మద్యం విక్రయాలు సాగిస్తున్నా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామాల్లో ఎక్కడ చూసినా మద్యం విక్రయాలే..**

ప్రభుత్వ అనుమతులు ఉన్న మద్యం దుకాణాలకు మాత్రమే విక్రయ నిబంధనలు వర్తిస్తుండగా, వాటి పరిధికి వెలుపల పలుచోట్ల అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కొందరు వ్యక్తులు గ్రామాల్లోనే మద్యం బాటిళ్లను నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో బెల్టుషాపులు నిర్వాహకులకు అదనపు ఆదాయ వనరుగా మారగా, సామాన్య ప్రజలు మాత్రం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు.

**మహిళలు, వృద్ధుల్లో ఆందోళన..**

నివాస ప్రాంతాల సమీపంలో మద్యం విక్రయాలు జరగడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మద్యం సేవించిన కొందరు వ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో గొడవలకు దిగడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని, మహిళలు, పిల్లలు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**యువతపై తీవ్ర ప్రభావం..**

గ్రామాల్లో బెల్టుషాపులు విస్తరించడంతో యువత మద్యానికి బానిసయ్యే ప్రమాదం పెరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సులభంగా మద్యం అందుబాటులో ఉండటంతో కొందరు యువకులు మద్యానికి అలవాటు పడుతున్నారని, దీని ప్రభావం వారి కుటుంబాలపై పడుతోందని చెబుతున్నారు. మద్యం కోసం కుటుంబ ఆదాయాన్ని ఖర్చు చేయడంతో అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఎక్సైజ్ శాఖ నిఘా ఏమైంది?**

బెల్టుషాపులపై నిఘా పెట్టి అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బెల్టుషాపుల సమాచారం అధికారులకు తెలియదా? లేక తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా అంటూ స్థానికులు నిలదీస్తున్నారు. తరచూ తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అధిక ధరలకు మద్యం విక్రయాలు?**

బెల్టుషాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అత్యవసర సమయంలో మద్యం కోసం వచ్చే వినియోగదారుల నుంచి ఇష్టానుసారంగా ధరలు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఒకవైపు అక్రమ విక్రయాలు సాగుతుండగా, మరోవైపు వినియోగదారులు అదనపు భారాన్ని మోయాల్సి వస్తోందని అంటున్నారు.

**అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి..**

బెల్టుషాపుల వల్ల గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం అప్పుడప్పుడు తనిఖీల పేరుతో కాకుండా నిరంతరం నిఘా పెట్టి అక్రమ మద్యం విక్రయాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు కళ్లుతెరిచి బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపుతారా లేక గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు ఇలాగే కొనసాగుతాయా? అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆందోళనను అధికారులు సీరియస్‌గా తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు..... సబ్ ఇన్స్పెక్టర్ జయబాబు

## టి.నరసాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసు : నిందితుడికి 1 సంవత్సరం జైలు శిక్ష, రూ.500 జరిమానా!

**టి.నరసాపురం: ఆగష్టు 14 (ప్రజా వీక్షణం)**





ఏలూరు జిల్లా టి.నరసాపురం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సంచలన పోక్సో కేసులో న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మండలంలోని గౌరిశంకరపురం గ్రామంలో 25-06-2021 తేదీన ఒక బాలికపై లైంగిక నేరానికి పాల్పడిన ఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టి.నరసాపురం పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 288/2021 కింద, సెక్షన్లు 363, 342, 376(ఏబీ) ఐ.పి.సి. మరియు పోక్సో చట్టం 2012 సెక్షన్ 5(ఎం) ఆర్/డబ్ల్యూ 6 కింద కేసు నమోదు చేయబడింది. ఈ కేసులో దర్యాప్తు పూర్తి చేసి సదరు కేసును జువైనెల్ జస్టిస్ కోర్టు సంఖ్య 60/2021గా విచారణ జరిపించి, జువైనెల్ జస్టిస్ బోర్డు -కమ్- రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, ఏలూరు వారి న్యాయస్థానంలో విచారణ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సాక్షులను విచారించడం, బాలిక వాంగ్మూలాన్ని నమోదు చేయించడం, వైద్య మరియు ఇతర అవసరమైన ఆధారాలను సేకరించి పోలీసులు పక్కాగా కేసును కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో 14-08-2026 తేదీన స్పెషల్ పోక్సో కోర్టు, ఏలూరు వారు తుది తీర్పు వెలువరిస్తూ.. నిందితుడు పోలమరశెట్టి శివశంకర్ (తండ్రి: సత్యనారాయణ, వయస్సు: 20 సంవత్సరాలు, నివాసం: గౌరిశంకరపురం గ్రామం, టి.నరసాపురం మండలం) అను అతనిని దోషిగా నిర్ధారించి, ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.500/- జరిమానా విధించారు. ఈ తీర్పు వెలువడిన అనంతరం టి.నరసాపురం సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం. జయబాబు మాట్లాడుతూ తీవ్రంగా స్పందించారు. సమాజంలో మహిళలు మరియు బాలికల భద్రతకు భంగం కలిగించే వారిని, ఇలాంటి అసాంఘిక శక్తులను ఏ పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. "సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ఆడపిల్లల జీవితాలతో ఆడుకోవాలని చూసినా ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదు. చట్టం తన పని తాను కచ్చితంగా చేసుకుపోతుంది. నేరాలకు పాల్పడేవాళ్లకు కఠినమైన శిక్షలు పడేలా మా పోలీస్ శాఖ నిరంతరం శ్రమిస్తుంది. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కఠిన చర్యలు తీసుకుంటుంది కాబట్టి, ఇలాంటి అరాచక చేష్టలకు పాల్పడే వారు ఎవరైనా సరే చట్టరీత్యా కఠిన శిక్షలను ఎదుర్కోక తప్పదని" ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడే వరకు కేసును సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లిన టి.నరసాపురం పోలీస్ స్టేషన్ దర్యాప్తు అధికారి, ఎస్సై ఎం. జయబాబు మరియు హెడ్ కానిస్టేబుల్-1635 ఎం. జయరాజుల కృషిని తోటి పోలీసులు, స్థానికులు ప్రత్యేకంగా అభినందించారు. కేసు దర్యాప్తు దశ నుండి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, నిందితుడికి తగిన శిక్ష పడేలా సహకరించిన పోలీసు సిబ్బంది పనితీరును ఉన్నతాధికారులు కొనియాడారు.

# ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన కార్యక్రమం..

## వేదిక శుద్ధీకరణ వివాదంపై కాంగ్రెస్ ఆగ్రహం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 14 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న బహిరంగ సభ ముగిసిన అనంతరం కొందరు వ్యక్తులు సభా వేదిక వద్ద "శుద్ధీకరణ" పేరుతో హోమం నిర్వహించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ పాల్గొని మాట్లాడారు. ఖర్గే వేదికపై ఉండటం వల్ల ఆ ప్రదేశం "అపవిత్రమైందని" భావించి శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడం అత్యంత అభ్యంతరకరమైన విషయమన్నారు. ఇలాంటి చర్యలు సమాజంలో వివక్ష, విభజనను పెంచడంతో పాటు సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం వంటి రాజ్యాంగ విలువలను అవమానించేలా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య భారతదేశంలో కుల, మత, సామాజిక వివక్షకు ఎలాంటి స్థానం లేదని అన్నారు. ప్రతి పౌరుడి గౌరవం, సమానత్వాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఏఎంసీ చైర్మన్ మంగ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైరాగడ్ మారుతి పటేల్, విశ్వనాథ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రాన్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, వాంకిడి మండల అధ్యక్షుడు మెంగాజీ, సీనియర్ నాయకులు జక్కన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శివాజీ, మండల ఉపాధ్యక్షుడు పెంటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

## ఘనంగా నూతన 'కాంపెక్టర్ జనరేటర్' ప్రారంభం

### నందిగామ నగర పంచాయతీలో పారిశుధ్యానికి పెద్దపీట

### అభివృద్ధిలో రాజీ లేదు: ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ, ఆగస్టు 14 (ప్రజా వీక్షణం)



ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే దిశగా నగర పంచాయతీ కీలక అడుగు వేసింది. నూతనంగా ఏర్పాటు చేసిన 'కాంపెక్టర్ జనరేటర్'ను శుక్రవారం నగర పంచాయతీ ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నేతలతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నందిగామ పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నూతన కాంపెక్టర్ జనరేటర్ అందుబాటులోకి రావడంతో చెత్త సేకరణ, తరలింపు ప్రక్రియ మరింత సులభతరం కావడంతో పాటు పారిశుధ్య సిబ్బందికి కూడా పనిభారం తగ్గుతుందని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల విషయంలో ఎక్కడా రాజీ లేకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని సౌమ్య తెలిపారు. నందిగామను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నగర పంచాయతీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్ కె.వి. నాగప్రభుకుమార్ ఆకస్మిక తనిఖీ !






### ఒక్కొక్క మొక్క ఒక్కొక్క ప్రాణం లాంటిది" అంటూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించిన అసిస్టెంట్ కమిషనర్

జంగారెడ్డిగూడెం ఆగష్టు 14(ప్రజా వీక్షణం)

అసిస్టెంట్ కమిషనర్ కె.వి. నాగప్రభు కుమార్ జంగారెడ్డిగూడెం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులన్నిం టినీ క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బంది పనితీరును సమీక్షించారు. నాటుసారా తయారీ మరియు రవాణాపై ఎప్పటికప్పుడు పక్కా సమాచారం సేకరించాలని, అలాగే తెలంగాణ మరియు ఇతర రాష్ట్రాల నుంచి సుంకం చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్న మద్యంపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ కె.వి. నాగప్రభుకుమార్ స్టేషన్ ఆవరణలో స్వయంగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఒక్కొక్క మొక్క ఒక్కొక్క ప్రాణం లాంటిది. ఇవి మనకు ప్రాణవాయువును (ఆక్సిజన్) ఇస్తాయి, నీడనిస్తాయి, కాలుష్యాన్ని తగ్గిస్తాయి మరియు మంచినీటి వనరుల్ని కాపాడతాయి. ప్రతి ఒక్కరూ ఒక మొక్కని పెంచడం పర్యావరణాన్ని కాపాడడానికి తీసుకునే ఒక పెద్ద అడుగు" అని పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఇన్స్పెక్టర్ కె. శ్రీనుబాబు, పోలవరం ఇన్స్పెక్టర్ కె. వీరబ్రహ్మం, జంగారెడ్డి గూడెం ఎస్సై సుబ్రమణ్యం మరియు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపారుపూడిలో అంబరాన్ని అంటిన దేశభక్తి ఉత్సాహం..

### ఘనంగా బీజేపీ తిరంగా ర్యాలీ!

పెద్దపారుపూడి, ఆగస్టు 14 (ప్రజా వీక్షణం):

కృష్ణా జిల్లా పెదపారుపూడి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో కూడిన ఈ ర్యాలీ స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని, భారత్ మాతా కీ జై అంటూ వారు చేసిన నినాదాలతో ప్రాంతమంతా మార్మోగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ సమైక్యత, అఖండత మరియు సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో జాతీయ భావాలను, దేశభక్తిని ఇనుమడింపజేసేలా ర్యాలీ అత్యంత విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ ప్రముఖులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# దేశాభివృద్ధికి పాటుపడదాం





### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజా వీక్షణం)

దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు త్యాగాలు చేశారని, వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరు దేశ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. స్థానిక చత్రపతి శివాజీ సర్కిల్లో శుక్రవారం నిర్వహించిన తిరంగా ర్యాలీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆనాడు స్వాతంత్రం కోసం పోరాడితే నేడు మనం కులం, మతం, ప్రాంతం అంటూ సంకుచిత ఆలోచనలు చేయటం దురదృష్టకరమని తెలిపారు. స్వాతంత్ర యోధుల స్ఫూర్తితో మనమందరం దేశం కోసం పనిచేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసే దిశగా అహర్నిశలు కృషి చేస్తున్నారని,ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. స్వాతంత్ర యోధుల త్యాగాలను నేటి తరానికి అవగాహన కల్పించే విధంగా తిరంగా వంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీ యమని కొనియాడారు .అనంతరం ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్బంగా ఆయన అభిమానులు నిర్వహిస్తున్న సేవా వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూ డెం మండలంలోని నవాబుపాలెం గ్రామంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నవాబుపాలెం సోసైటీ అధ్యక్షుడు అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేద ప్రజలకు వైద్య సహాయం అందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో పనిచేస్తే మంచి సమాజం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 14 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతి పట్టణంలో మరియు జిల్లా కేంద్రంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు ఇచ్చిన పిలుపు మేరకు తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, అదే క్రమంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కూడా తిరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నరేంద్ర మోడీ పాలనే దేశానికి శ్రీరామ రక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరిగేల నాగేశ్వర్ రావు, ఎస్టీ మోర్చా నాయకులు కొట్నాక విజయ్, భాజపా సీనియర్ నాయకులు కంద్రే విశాల్, సతీష్ బాబు, ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు జాడి అశోక్, భాజపా నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.




# నందిగామ మెయిన్ పోస్టాఫీసుకు నూతన భవనం మంజూరు చేయాలి

### - ఎంపీ కేశినేని చిన్ని దృష్టికి సమస్యను తీసుకెళ్లిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

### - ప్రజా అవసరాలే లక్ష్యంగా కూటమి నేతల కృషి

నందిగామ, ఆగస్టు 14 (ప్రజా వీక్షణం):




ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో మెయిన్ పోస్టాఫీసుకు నూతన భవనాన్ని నిర్మించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. శుక్రవారం విజయవాడ ఆటోనగర్‌లోని ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజాసంఘాల ప్రతినిధులు మరియు కూటమి నేతలతో కలిసి ఆమె విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ని కలిసి వినతి పత్రం అందజేశారు. నందిగామ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజలు మెయిన్ పోస్టాఫీసుకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, అయితే ప్రస్తుతం ఉన్న భవనం ప్రజల అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో సేవలు పొందడంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే సౌమ్య ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణంలో పోస్టల్ సేవలు అందించేందుకు అన్ని మౌలిక వసతులతో కూడిన నూతన భవనం అత్యవసరమని వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఈ మెయిన్ పోస్టాఫీసు కీలకమైన సేవా కేంద్రంగా ఉందని, నూతన భవనం మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని ఆమె కోరారు. ప్రజా సమస్యలను గుర్తించి, సంబంధిత కేంద్ర–రాష్ట్ర శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడమే కూటమి ప్రజాప్రతినిధుల ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. నందిగామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు సమన్వయంతో ముందుకు సాగుతామని వారు తెలిపారు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
15 శనివారం ఆగస్టు 2026
9
www.prajaveekshanam.in

## శిథిలావస్థలో అంగన్వాడీ కేంద్రం..

### చిన్నారుల భద్రతపై ఆందోళన....

### నూతన భవనం నిర్మించాలి...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆగస్టు 14 (ప్రజా వీక్షణం న్యూస్ )

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం, కిష్టాపూర్:
కిష్టాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో చిన్నారుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం పాత అంగన్వాడీ భవనం వినియోగానికి అనుకూలంగా లేకపోవడంతో కమిటీ హాల్‌లో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.అయితే కమిటీ హాల్ భవనం కూడా శిథిలావస్థకు చేరుకుని, పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతున్న పరిస్థితి నెలకొంది. చిన్నారులు, అంగన్వాడీ సిబ్బంది ప్రతిరోజూ ఈ భవనంలోనే ఉండాల్సి రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ఈ సమస్యపై దుర్గం శ్రీనివాస్ (ఆర్ టి ఐ యాక్టివిస్ట్, సోషల్ వర్కర్), గ్రామ సభ్యుడు గోలేటి నాగేష్ కలిసి ఆసిఫాబాద్ సి డి పి ఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కిష్టాపూర్ గ్రామంలోని చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, నూతన అంగన్వాడీ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.శిథిలావస్థలో ఉన్న భవనంలో చిన్నారులను కొనసాగించడం ప్రమాదకరమని, ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని దుర్గం శ్రీనివాస్, గోలేటి నాగేష్ కోరారు.చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి.. కిష్టాపూర్ అంగన్వాడీ కేంద్రానికి నూతన భవనం మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## అమ్మవారి వార్షికోత్సవంలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు..

దేవరకద్ర ఆగస్టు 14 ప్రజావిక్షణం

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 9వ వార్షికోత్సవ వేడుకలు 17 నుంచి 19 వరకు జరుగుతాయని అందుకు ఈ వార్షికోత్సవానికి హాజరుకావాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, కి శుక్రవారం ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, కన్నయ్య, చంద్రయ్య, నాగయ్య, లక్ష్మీనారాయణ, హరికాంత్,తదితరులు పాల్గొన్నారు.



## షిర్డీ సాయిబాబా ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజా వీక్షణం)

షిర్డీ సాయిబాబా ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు ఆకాంక్షించారు. తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలోని షిర్డీ సాయిబాబాను ఆయన శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ నాయుడు మాట్లాడుతూ సాయిబాబా బోధించిన ప్రేమ, సేవ, సోదరభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యాలతో జీవించాలన్నారు. సాయిబాబా కరుణాకటాక్షాలు రాష్ట్రంపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలకు మంచి జరగాలని, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెనాలి ట్యాంక్ బండ్ పై లచ్చన్న విగ్రహావిష్కరణ

### బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

బాపట్ల : ఆగస్టు 14 ( ప్రజా వీక్షణం )

ఈనెల 16న పలువురు ప్రజాప్రతినిధులచే తెనాలి ట్యాంక్ బండ్ పై స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న గారి విగ్రహావిష్కరణ జరుగనున్నందున యావన్మంది ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. శుక్రవారం స్థానిక బాపట్ల జిల్లా కార్యాలయంలో పలువురు బీసీ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ మేరకు పిలుపునిచ్చారు. సాయంత్రం 3 గంటలకు తెనాలి బస్టాండ్ సమీపంలోని జిల్లా గౌడ సంఘం కార్యాలయం నుండి భారీ ర్యాలీ గా ట్యాంక్ బండ్ వరకు జరుగుతుందని,4 గంటలకు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం-సభ నిర్వహించబడతాయన్నారు. ఇంకా వారు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు-రైతు బాంధవుడు-అణగారిన వర్గాల ఆశాజ్యోతి కీ.శే.డా: సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని తెనాలిలో ట్యాంక్ బండపై ఆవిష్కరించుకోవడం సంతోషదాయక మన్నారు. ఉద్యమాల నిప్పు కణిక లచ్చన్న 17 ఏండ్ల ప్రాయంలోనే స్వాతంత్రోద్యమంలో దుమికిన యువ కిశోరమన్నారు. 1930లో మహాత్మా గాంధీ పిలుపునందుకొని ఉప్పు సత్యాగ్రహాన్ని,1932లో శాసనోల్లంఘన ఉద్యమం తో పాటు, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలలోనూ,1942 క్విట్ ఇండియా ఉద్యమాలలోనూ వారు చురుకుగా పాల్గొన్నారన్నారు. హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూవారికి ఆలయ ప్రవేశం కల్పించి అంటరానితనం నిర్మూలన చేసి చూపించారన్నారు. జై ఆంధ్ర ఉద్యమం చేపట్టి,పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఆవశ్యకతను ఆనాడే గుర్తించి పోరాడిన యోధుడు వారన్నారు. బడుగుల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న తన గీత కార్మిక వర్గాల ఐక్యతను చాటుతూ గౌడ జాతి-బీసీ బిడ్డల అభివృద్ధి కోసం వారు ఎనలేని సేవలందించారన్నారు. భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అన్నారు.వారి సాహసానికి-కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్ బిరుద న్నారు. మహాత్మా గాంధీజీ-నేతాజీ సుభాష్ చంద్రబోస్-వి.వి.గిరి,ఆచార్య రంగా మొదలగు జాతీయ నాయకులతో కలిసి స్వాతంత్ర పోరాటాలలో పాల్గొని, అనేకసార్లు జైలు జీవితం గడిపారన్నారు. ఆ మహనీయుని జయంతి-వర్ధంతులను ప్రభుత్వమే నిర్వ హించడం అభినందనీయమని,ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభు త్వానికి ధన్యవాదాలు తెలిపారు. అందుకే బడుగుల ఆరాధ్య దైవమైన డా: సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై వారి జయంతి రోజైన ఈ నెల 16న ఆవిష్కరించుకుం టున్నామన్నారు. ముఖ్యంగా గౌడలు,బీసీలు,లచ్చన్న అభిమానులతో పాటు యావన్మంది ప్రజలు హాజరై ముందుగా భారీ ర్యాలీలో పాల్గొని,ఆపై లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శంకరరావు పిలుపునిచ్చారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు మద్దిబోయిన తాతయ్య,రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు గుర్రం ద్వారకా శ్రీను,జిల్లా యువజన అధ్యక్షులు శీలం సాగర్ బాబు,నూర్ భాషా నాగూర్, బి.మానస,ఏ.రోజా,కె.అనిత పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.



## తూర్పుగోదావరి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి ఆకస్మిక తనిఖీలు

### రెండు రోజుల పాటు విస్తృత తనిఖీలు.. రేషన్ దుకాణాలు, అంగన్వాడి కేంద్రాలు, వసతి గృహాల పరిశీలన

తూర్పుగోదావరి జిల్లా:ఆగష్టు 14(ప్రజా వీక్షణం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి తూర్పుగోదావరి జిల్లాలో (12/08/2026 - 13/08/2026 తేదీలలో) రెండు రోజుల పాటు విస్తృతమైన క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా మండపేట, రాజమండ్రి పట్టణం, రాజమండ్రి గ్రామీణ, రాజానగరం, నిడదవోలు నియోజకవర్గాలలో రేషన్ దుకాణాలు, అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ (బాలురు మరియు బాలికల) వసతి గృహాలు, సాంఘిక సంక్షేమ (బాలురు మరియు బాలికల) వసతి గృహాలు, గిరిజన సంక్షేమ (బాలురు మరియు బాలికల) వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలు, రేషన్ పంపిణీ తీరు, విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజన నాణ్యత మరియు వసతి గృహాల్లోని మౌలిక వసతులను స్వయంగా పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.ఈ తనిఖీల్లో చైర్మన్‌తో పాటు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పార్వతి, జిల్లా పౌర సరఫరాల నిర్వహణాధికారి గణేష్, సమైక్య శిశు అభివృద్ధి సేవా పథకం ప్రాజెక్టు



సంచాలకులు తోట శ్రీదేవి, సాంఘిక సంక్షేమ ఉప సంచాలకులు ఎండి గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జ్యోతి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి బి. శశాంక, జిల్లా సహకార అధికారి రాజకుమారి, ఉప విద్యాశాఖ అధికారి వి.వి. వెంకటరాజు, తూనికలు కొలతల మరియు ఆహార భద్రతా అధికారులతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేళ రెట్టింపు ఆనందం.. ఘనంగా టీడీపీ నేత కాల్నేడీ రాంబాబు పుట్టినరోజు!






“దేశం మొత్తం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ పవిత్రమైన రోజున, నా పుట్టినరోజు కూడా రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను” -- కాల్నేడీ రాంబాబు

టీ. నరసాపురం ఆగష్టు 15(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకులు, ప్రజానేత కాల్నేడీ రాంబాబు పుట్టినరోజు వేడుకలు నేడు అత్యంత ఘనంగా, పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. దేశం మొత్తం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్న వేళ, సరిగ్గా ఇదే పవిత్రమైన రోజున తమ ప్రియతమ నాయకుడి జన్మదినం కావడంతో తెలుగుదేశం శ్రేణులు, అభిమానులు ఆనందంలో మునిగిపోయారు.ఈ సందర్భంగా కాల్నేడీ రాంబాబు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన ఈ చారిత్రాత్మకమైన ఆగస్టు 15న తన పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, దీన్ని కేవలం యాదృచ్ఛికంగా కాకుండా తన పూర్వజన్మ సుకృతంగా మరియు మహా అదృష్టంగా భావిస్తున్నానని భావోద్వేగంతో తెలిపారు. దేశభక్తి ఉప్పొంగే ఈ మహోత్సవ రోజున పుట్టినరోజు జరుపుకోవడం తన బాధ్యతను మరింత పెంచుతోందని, ప్రజల సంక్షేమం కోసం, పార్టీ అభివృద్ధి కోసం తన చివరి శ్వాస వరకు శ్రమిస్తానని ఆయన స్పష్టం చేశారు.తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి టీడీపీ ప్రముఖులు, పార్టీ శ్రేణులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కాల్నేడీ రాంబాబుకు ఫోన్ ద్వారా, నేరుగా కలిసి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు దేశం పార్టీ కోసం ఆయన చేసిన సేవలను, నిరంతరం ప్రజాక్షేత్రంలో ఆయన పోరాడుతున్న తీరును పలువురు సీనియర్ నాయకులు కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు మరింత సేవ చేసేలా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.రాంబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన నివాసంలో మరియు పార్టీ కార్యాలయాలలో అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ వేడుకలు తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపాయి.

# స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటేలా వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

### పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకా విష్కరణ చేయనున్న మంత్రి పొంగులేటి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 14 (ప్రజా వీక్షణం న్యూస్)

హనుమకొండ జిల్లా కేంద్రం లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో ఆగస్టు 15న స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందు కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. ఉదయం 9:20 గంటలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9:30 గంటలకు మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం పోలీస్ పరేడ్ ను పరిశీలించి గౌరవ వంద నం స్వీకరి స్తారని పేర్కొన్నా రు. ఈ సందర్భంగా మంత్రి హనుమకొండ జిల్లా అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమా లపై ప్రసంగి స్తారని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమా లు, వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను ప్రతిబింబించే శక టాల ప్రదర్శన నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ రంగాల్లో ప్రతి భ కనబరిచిన అధికారు లు, ఉద్యోగులు, విద్యార్థు లు, సం స్థలు, ఇతరులకు పురస్కారాల ప్రదా నం ఉంటుందని తెలిపారు. అనం తరం జాతీయ గీతా లాపనతో వేడుకలు ముగు స్తాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం గా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేస్తు న్నారని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌ కర్యం కలగకుండా తాగు నీరు, పారిశుద్ధ్యం, పార్కిం గ్, భద్రత తదితర ఏర్పాట్ల పై ప్రత్యేక



దృష్టి సారించి నట్టు కలెక్టర్ వెల్లడించారు.

# నోటీసులు ఇవ్వకుండా ఇంటి కూల్చివేత అప్రజాస్వామిక చర్య

### వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 15 (ప్రజా వీక్షణం)

తణుకు ఐతంపూడి మాజీ సర్పంచ్ లావణ్య, జితేందర్ ఇంటి కూల్చివేత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారనే కారణంతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా భారీగా పోలీసులను మోహరించి ఇంటిని కూల్చివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తెలిపారు. ఇంట్లోని మహిళలు, చిన్నారులు, వృద్ధులను ఇబ్బందులకు గురిచేయడం ఏ విధమైన పాలన అని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని హితవుపలికారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ చట్టపరమైన హక్కులు, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత కక్షలకు మలచకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించాలని సూచించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలను వెంటనే నిలిపివేసి, లావణ్య, జితేందర్ కుటుంబానికి న్యాయం చేయాలని వడ్డీ రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తన సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆ భూమికి మేమే అసలైన వారసులం

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పట్టణంలోశ్రీ సత్యనారాయణ స్వామి గుడి ప్రాంతంలో మార్వాడి మిల్లు గా పిలిచే రైస్ మిల్లు ఏరియాలో నాలుగున్నర ఎకరాల భూమికి తామే చట్టబద్ధమైన వారసులమని, మా భూమిని మమ్మల్ని భయపెట్టి ఆక్రమించారని ఆ భూమి యజమాని గా చెబుతున్న స్వర్గీయ దామోజీపురపు ముఖ్య ప్రాణ కుమార్ వారసులు ఆరోపించారు. స్థానిక రాము స్వీట్ షాపులో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రాణ్ కుమార్ వారసులు దామోజీ పురపు శివరామకృష్ణ, మారేమండ రామశేషు , కాకులవరపు జగన్మోహిని, దాతారం విశ్వమోహిని,చిల్లరేగి కృష్ణప్రియ మాట్లాడారు. దశాబ్దాల కాలంగా అన్యాక్రాంతమైన తమ భూమిని కాపాడుకోవడానికి న్యాయ పోరాటం చేస్తున్నామని తెలిపారు. తమ కుటుంబ మిత్రుడు మైలవరపు సుబ్బారాయుడు (పెదబాబు )అనే వ్యక్తిని తమ ఆస్తికి పవర్ ఆఫ్ అటార్నీగా నియమించుకున్నామని తెలిపారు. న్యాయస్థానంలో పోరాడుతున్న తమపై కక్షతో లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదం కుమార్ గుప్తా, ఆయన వారసులు తమ భూమిని అక్రమంగా అధీనంలో ఉంచుకోవడమే కాకుండా, కొందరు అధికారుల అండ దండలతో ఈ భూమిని అమ్ముకుంటున్నారని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కి వినతిపత్రం సమర్పించామని వారు తెలియజేశారు.



# దశదిన కర్మ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 14 (ప్రజా వీక్షణం న్యూస్)

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ ఎస్ సీనియర్ నాయకుడు కేశబోయిన సంపత్ తండ్రి కేశబోయిన చేరాలు, అలా గే ఆడెపు కోటేశ్వర్, ఆడెపు శ్రీనివాస్, భాస్కర్‌ల తల్లి ఆడెపు మణెమ్మ దశదిన కర్మ కార్యక్రమాల్లో బీఆర్ ఎస్ నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులను పరా మర్శించారు. ఈ సందర్భం గా బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ చైర్మన్ డా. బండి రజనీ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పం చ్ చుంచు రవి, సీనియర్ నాయకులు సూరం వాసు దేవరెడ్డి, పోలపల్లి రాజు (మైఖేల్), సూరం మనోహ ర్, పెద్దపల్లి కిరణ్, రాచర్ల శంకర్, మణికంఠ, సదానం దం, తిరుపతి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రేలంగి వెంకట్రామయ్య విగ్రహం ఏర్పాటు అభినందనీయం

### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజా వీక్షణం)

సుప్రసిద్ధ తెలుగు సినీ హాస్య నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత రేలంగి వెంకట్రామయ్య విగ్రహాన్ని ఎర్పాటుచేయటం అభినందనీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ కొనియాడారు. రేలంగి వెంకట్రామయ్య స్థాపించిన రేలంగి చిత్ర మందిర్ కాంప్లెక్స్ కూడలిలో ఏర్పాటుచేసిన రేలంగి వెంకట్రామయ్య విగ్రహాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నటించి ప్రేక్షకులను అలరించడంతోపాటు తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. తన సహజమైన హావభావాలు, సంభాషణా శైలితో ప్రత్యేకమైన హాస్యాన్ని పండించి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారని కొనియాడారు.తెలుగు చలనచిత్ర పరిశ్రమలో హాస్య నటుడిగా విశిష్ట గుర్తింపు పొందిన రేలంగి వెంకట్రామయ్య తాడేపల్లిగూడెం వాసి కావడం పట్టణ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. తన హాస్యంతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన మహానటుడి జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేందుకు విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. హాస్యానికి కొత్త ఒరవడిని తీసుకొచ్చిన ఘనత సుప్రసిద్ధ నటుడు, పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్యదేనన్నారు. తాడేపల్లిగూడెం గడ్డపై జన్మించిన రేలంగి వెంకట్రామయ్య తెలుగు సినిమా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటారని అన్నారు. ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమన్నారు. రేలంగి పుట్టిన గడ్డపై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు ఆయన సేవలను పరిచయం చేసినట్లవుతుందని పేర్కొన్నారు.రేలంగి వెంకట్రామయ్య విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ విగ్రహం ఏర్పాటుకు సీనియర్ నాయకులు తోట గోపీ ఎంతగానో సహకరించారని ప్రశంసించారు. రేలంగి కుటుంబ సభ్యులను తీసుకురావటంలోను, నాయకులను, అభిమానులను తీసుకురావడానికి బాలకృష్ణ చేసిన కృషి అభినందనీయమన్నారు. రేలంగి విగ్రహం భవిష్యత్ తరాలకు ఆయన కళా ప్రస్థానాన్ని గుర్తుచేసే స్ఫూర్తి చిహ్నంగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల గుర్తుగా సుభాష్ చంద్రబోస్ భగత్ సింగ్ విగ్రహాలను కూడా ఏర్పాటు చేయనున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, సాయిబాబా, వర్తనపల్లి కాశి, ఆకాశపు స్వామితో నాయకులు అభిమానులు భారీగా పాల్గొని రేలంగి వెంకట్రామయ్య కళా సేవలను, తెలుగు సినీ రంగానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.



# దళిత జాతి అభ్యున్నతికి మరింతగా పనిచేస్తా

### దళిత రత్న అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది

### భీమ వినయ్ కుమార్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 14 (ప్రజా వీక్షణం న్యూస్)

దళిత జాతి అభ్యున్నతి, దళిత బిడ్డల విద్య, సామా జిక న్యాయం కోసం చేస్తు న్న సేవలకు భీమ వినయ్ కుమార్‌కు 2026 సంవత్స రానికి 'దళిత రత్న' అవా ర్డు లభించింది. డా. బాబు జగ్జీవన్ రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్స వాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో వరంగల్ పశ్చిమ ఎమ్మె ల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా భీమ విన య్ కుమార్ మాట్లాడుతూ ఈ పురస్కారం తనకు గౌర వంతో పాటు మరింత బాధ్యతను పెంచిందన్నా రు. దళిత విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిం చి జీవితంలో ఉన్నత స్థా యికి ఎదిగేలా ప్రోత్సహిం చడంతో పాటు, వెనుకబడి న కుటుంబాలకు అండగా నిలుస్తానని తెలిపారు. తన శాయశక్తులా దళిత సమాజం అభ్యున్నతికి పనిచేస్తానని స్పష్టం చేశా రు. ఆయనకు పలువురు దళిత సంఘాల నాయకు లు, సామాజిక కార్యకర్తలు, యువత అభినందనలు తెలిపారు.






# కాజీపేట ఆర్ఓబీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### పనుల జాప్యంలో అలసత్వాన్ని సహించేది లేదు

### కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 14 (ప్రజా వీక్షణం న్యూస్)

కాజీపేట లో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వేగ వంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.శుక్రవారం ఆర్ఓబీ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్. పనుల పురోగతిని, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను సమీక్షించా రు. సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని సూచిం చారు. నాణ్యతా ప్రమాణా లు పాటిస్తూ నిర్దేశిత గడు వులోగా పనులు పూర్త య్యేలా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భం గా ఆర్అండ్‌బీ ఎస్ఈ సురేష్ బాబు, ఈఈ దేవిక, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారింది

## టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్



స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా టీమిండియా ఆడే 600వ టెస్ట్ మ్యాచ్‌కు నాయకత్వం వహించడం చాలా గర్వంగా ఉందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)2027 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోవడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని చెప్పాడు. తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారిందన్నాడు. డబ్ల్యూటీసీ 2027 సైకిల్‌లో భాగంగా శ్రీలంక పర్యటనలో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. రేపు( శనివారం) గాలే అంతర్జాతీయ మైదానంలో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇది భారత్‌కు 600వ టెస్ట్ మ్యాచ్. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నాడే ఈ మ్యాచ్ జరుగుతుండటం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సిరీస్‌కు టీమిండియా అన్ని విధాల సిద్ధమైంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శుభ్‌మన్ గిల్ పాల్గొన్నాడు. సిరీస్ గెలిచి డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ రేసులో నిలవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. 'కెప్టెన్సీ బాధ్యతల్లో నేను చాలా సౌకర్యంగా ఉన్నా. శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కాలంటే.. కనీసం మేం ఏడు టెస్ట్‌ల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి ఫ్రెష్‌గా మెదలుపెడుతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం నాడే భారత్ 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి చారిత్రాత్మక పోరుకు సారథ్యం వహించడం నాకు దక్కిన గొప్ప గౌరవం. మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఆటగాళ్లకు కాస్త సమయం ఇవ్వాలి. కొందరికీ కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అయినా సరే వారికి అండగా ఉంటాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ మెరుగ్గా రాణించాడు. కానీ అతను గాయం కారణంగా తప్పుకోవాల్సి వచ్చింది. బీసీసీఐ సీఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్ మధ్య ఎలాంటి గ్యాప్ లేదు. మేం కోరుకున్నంత వేగంగా సాయి సుదర్శన్ కోలుకోలేకపోయాడు. అయితే మా జట్టులోని 15 మంది ఆటగాళ్లపై మాకు నమ్మకం ఉంది. తుది జట్టును ఇంకా ఖరారు చేయలేదు. పేసర్ల ఎంపిక తలనొప్పిగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. బౌన్స్‌ను కూడా రాబడతాడు. అయితే ప్రసిధ్ కృష్ణ వామప్ మ్యాచ్‌లో కూడా సత్తా చాటాడు. సిరాజ్‌తో పాటు రెండో పేసర్ ఎవరా? అనేది తేల్చుకోలేకపోతున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తుది జట్టును ఎంపిక చేస్తాం.'అని శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు.

# జెమిమా రోడ్రిగ్స్ కు గాయం..



ఇండియన్ ఉమెన్స్ క్రికెట్ టీమ్ స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ ఇంజ్యూరీ కారణంగా రాబోయే రెండు బిగ్ టోర్నమెంట్లకు దూరమైంది. ఇంగ్లాండ్ లో జరిగిన 'ద హండ్రెడ్' లీగ్ లో ఆడుతున్న సమయంలో హామ్‌స్ట్రింగ్ గాయం వల్ల ఆమె రాబోయే ఉమెన్స్ ఆసియా కప్ తో పాటు ఏషియన్ గేమ్స్ నుంచి కంప్లీట్ గా రూల్ అవుట్ అయింది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (సీఓఈ) మెడికల్ టీమ్ ఆమెను పరిశీలించి, గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో రెస్ట్ అవసరమని తెలిపినట్లు బిసిసిఐ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. "ఆగస్టు 3న ఇంగ్లాండ్ లో 'ద హండ్రెడ్' మ్యాచ్ ఆడుతుండగా జెమిమా కుడి తొడ కండరాల గాయానికి గురైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో బిసిసిఐ మెడికల్ టీమ్ ఆమెకు క్లినికల్ టెస్టులు నిర్వహించింది. ఈ టెస్టుల్లో ఆమెకు హై-గ్రేడ్ టియర్ ఉన్నట్లు తేలింది" అని బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. దాంతో యూఏఈ వేదికగా జరగబోయే ఆసియా కప్, జపాన్ లో జరగబోయే ఏషియన్ గేమ్స్ కు జెమిమా దూరమవ్వక తప్పలేదు. 25 ఏళ్ల జెమిమా స్థానంలో ప్రతీక రావల్ ను ఉమెన్స్ సెలెక్షన్ కమిటీ రీప్లేస్‌మెంట్ గా ఎంపిక చేసింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ వేదికగా ఏసీసీ ఉమెన్స్ ఆసియా కప్ జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ లోని ఐచి-నగోయా వేదికగా ఏషియన్ గేమ్స్ జరగనున్నాయి. కీలకమైన ఈ రెండు టోర్నీలకు ముందు స్టార్ బ్యాటర్ దూరం కావడం భారత జట్టుకు బిగ్ షాక్ అనే చెప్పాలి. జెమిమా రోడ్రిగ్స్ స్థానంలో ప్రతీక రావల్ ఎంట్రీతో బిసిసిఐ అప్‌డేటెడ్ స్క్వాడ్ ను రిలీజ్ చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్ గా టీమ్ ను లీడ్ చేయనున్నారు. జట్టులో షెఫాలీ వర్మ, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్, ప్రతీక రావల్ ఉన్నారు.

# శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దు

శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా శ్రీలంకలోని గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఆగస్టు 15 నుంచి భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు మ్యాచ్? ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు టెస్ట్ సిరీస్ ఆడేందుకు శ్రీలంకలో అడుగుపెట్టింది.ఈ నేపథ్యంలో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీమిండియాను హెచ్చరించారు. ఆతిథ్య శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దని.. ఈ సిరీస్ టీమిండియాకు అంత సులభంగా ఉండబోదని స్పష్టం చేశారు. భారత్, శ్రీలంక జట్లు చివరిసారిగా 2022లో బెంగళూరులో డే-నైట్ టెస్టులో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా 238 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత ఈ రెండు జట్లు సుదీర్ఘ కాలం పాటు టెస్టుల్లో ఎదురు పడలేదు. ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పరంగా ఈ సిరీస్ అత్యంత కీలకమైనదని.. ప్రస్తుతం స్టాండింగ్స్ లో మెరుగైన స్థానంలో ఉన్న శ్రీలంక భారత్ కు గట్టి పోటీనిస్తుందని ధనంజయ డి సిల్వా ధీమా వ్యక్తం చేశారు. సాధారణంగా గాలే స్టేడియం పిచ్ స్పిన్నర్లకు విపరీతంగా సహకరిస్తుందనే పేరుంది. అయితే ఈ సారి పిచ్ పరిస్థితులు భిన్నంగా ఉంటాయని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా గ్రౌండ్ సిబ్బంది పూర్తి స్థాయిలో పిచ్ ను సిద్ధం చేయలేకపోయినప్పటికీ.. ఈ వికెట్ బ్యాటర్లకు బాగా సహకరిస్తుందని ఆయన వెల్లడించారు. ఇరు జట్ల బ్యాటర్లకు మంచి పరుగులు సాధించే అవకాశం ఉంటుందని డి సిల్వా అభిప్రాయపడ్డారు. గాయపడిన కుశాల్ మెండిస్ స్థానంలో సీనియర్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లాను జట్టులోకి తీసుకోవడంపై డి సిల్వా వివరణ ఇచ్చారు. 'గాలే స్టేడియంలో వికెట్ కీపింగ్ చేయడం చాలా సవాలుతో కూడుకున్నది. అందుకే టాలెంటెడ్ వికెట్ కీపర్ అవసరం ఏర్పడింది" అని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. అలాగే ఈ మ్యాచ్ ద్వారా యువ ఆఫ్ స్పిన్నర్ కేశర నువంత టెస్టుల్లోకి అరంగేట్రం చేసే అవకాశం ఉందని తెలిపారు.



# తొలి టెస్ట్‌కు భారీ అడ్డంకి!



భారత టెస్ట్ టీమ్ చారిత్రాత్మక మ్యాచ్‌కు సిద్ధమైంది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం గాలే వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య శ్రీలంకతో అమీతుమీ తేల్చుకోనుంది. ఇది టెస్ట్‌ల్లో టీమిండియాకు 600వ మ్యాచ్ కావడం విశేషం. స్వాతంత్ర్యదినోత్సవం నాడే ఈ మ్యాచ్ ప్రారంభమవుతుండటం మరింత ప్రత్యేకత సంతరించుకుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకం. డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ బెర్త్ దక్కాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా క్లీన్ స్వీప్ చేయాలి. దాంతోనే విజయమే లక్ష్యంగా శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా బరిలోకి దిగుతోంది. శ్రీలంక కండిషన్స్‌కు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే అక్కడికి వెళ్లి సన్నద్దమైంది. వామప్ మ్యాచ్ కూడా ఆడి గెలిచింది. అయితే తొలి టెస్ట్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే వర్షం కారణంగా గాలే వేదికగా టీమిండియా సన్నాహకాలకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం కూడా టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌కు వర్షం అడ్డంకిగా మారింది. తొలి టెస్ట్ జరిగే ఐదు రోజుల పాటు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం గాలేలో వాతావరణం మేఘావృతమై, చల్లని గాలులు వీచడంతో పాటు చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. కాబట్టి మ్యాచ్ కాస్త ఆలస్యంగా ప్రారంభం కావచ్చు. ఉష్ణోగ్రతలు 30-31లీజ మధ్య ఉండే అవకాశం ఉండగా.. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతతో ఆటగాళ్లు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. అక్యూవెదర్ రిపోర్ట్ ప్రకారం.. శనివారం ఉదయం 90 శాతం వర్షం పడే అవకాశం ఉంది. 5.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. గంటకు సుమారు 20-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. రెండో రోజైన ఆదివారంతో పాటు తర్వాతి సోమవారం, మంగళవారం, బుధవారాల్లో కూడా వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. దాంతో మ్యాచ్‌కు పదే పదే అంతరాయం ఏర్పడవచ్చు. 2017లో చివరిసారిగా శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమిండియా.. కోహ్లీ సారథ్యంలో 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. గాలేలో చివరిసారిగా జరిగిన టెస్ట్‌లో టీమిండియా 304 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది.

# సర్ఫరాజ్ స్పిన్ ను సమర్థవంతంగా ఆడగలడు

## టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతలపై మేనేజ్‌మెంట్ స్పష్టతనిస్తే ఉప ఖండపు రారాజుగా ఎదుగుతాడని తెలిపాడు. సర్ఫరాజ్ ఖాన్ స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడగలడని అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శనివారం(ఆగస్ట్ 15) నుంచి గాలే ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా తొలి టెస్ట్ మొదలవ్వనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్‌పై ఆశలు సజీవంగా ఉండాలంటే.. ఈ సిరీస్ గెలవడం టీమిండియాకు కీలకం. అయితే భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో జట్టుకు దూరమయ్యారు. సాయి సుదర్శన్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన అశ్విన్.. సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతల గురించి క్లారిటీ ఇవ్వాలని మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. 'సాయి సుదర్శన్ గాయంతో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. సర్ఫరాజ్‌కు జట్టులో తన పాత్రపై క్లారిటీ ఇవ్వాలి. కొన్ని కండిషన్స్‌లో అతని సామర్థ్యంపై సందేహం ఉంటే ఆ విషయాన్ని అతనికి చెప్పాలి. ఉపఖండం కండిషన్స్‌లోనే నువ్వు రాణించగలవు, అప్పుడే నీకు అవకాశం ఇస్తామని చెప్పాలి. అప్పుడు సర్ఫరాజ్ ఖాన్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోడు. మంచి స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలో మరింత ఫోకస్ పెడుతాడు. ఉంపఖండపు పరిస్థితుల్లో రారాజుగా మారుతాడు. తన కెరీర్‌ను నిర్మించుకుంటాడు. స్పిన్ కాకుండా ఇతర కండీషన్స్‌లో అతను రాణించలేడని భావిస్తే.. ఆ విషయాన్ని అతనికి చెప్పాలి.'అని అశ్విన్ సూచించాడు. అయితే తుది జట్టులో సర్ఫరాజ్ ఖాన్‌కు బదులు ముందుగా ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. గాలె స్టేడియం స్పిన్‌కు అనుకూలంగా ఉంటుంది. ఈ క్రమంలోనే ధ్రువ్ జురెల్‌కు బదులు సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచిస్తున్నారు. సర్ఫరాజ్ ఖాన్ స్పిన్‌ను సమర్థవంతంగా ఆడగలడని పేర్కొంటున్నారు. మరోవైపు ధ్రువ్ జురెల్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలోనే సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం దక్కుతుందా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.



# ఓ కుటుంబ కథా చిత్రమ్...విశ్వనాథ్ అండ్ సన్స్




కొన్నేళ్లుగా కుటుంబ కథలు అరుదుగా తెరకెక్కుతున్నాయి. అగ్ర కథానాయకులైతే అటువైపు దృష్టిపెట్టడమే మానేశారు. ఈమధ్యే మళ్లీ ఆ కథలకు పూర్వ వైభవం వస్తున్నట్టు అనిపిస్తోంది. పలువురు యువ దర్శకులు కుటుంబ కథలపై మళ్లీ దృష్టిపెడుతున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ద్వారా అదే ప్రయత్నం చేశారు. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారసుడు. పేరున్న వ్యాపారవేత్త అయినా, 40 ఏళ్లు వచ్చినా వివాహం చేసుకోడు. తల్లి (రాధిక శరత్‌కుమార్) మాత్రం పెళ్లి చేసుకోవాలని, వారసుడిని కని ఇవ్వాలని పోరు పెడుతుంటుంది. దాంతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాబుని కని ఇంటికి తీసుకొస్తాడు. కానీ ఊహించని రీతిలో ఆ చిన్నారి అనారోగ్యానికి గురవుతాడు. చికిత్స చేసే క్రమంలో ఆ చిన్నారికి కన్నతల్లి అవసరం ఏర్పడుతుంది. దాంతో ఆమెని వెతుక్కుంటూ మళ్లీ అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. మరి తన బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? ఇంతకీ ఆమె ఎవరు? అమెరికా నుంచి ఇండియాకి రావడానికి అంగీకరిస్తుందా? లేదా? సంజయ్ పెళ్లి విషయంలో తన తల్లి కోరికని నెరవేర్చాడా? సంజయ్ జీవితంలో మదన కామేశ్వరి అలియాస్ మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? తదితర విషయాలన్నీ హృద్యంగా చిత్రీకరించారు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం, భావోద్వేగాలున్న సినిమా ఇది. హృదయాల్ని హత్తుకునే ఓ కుటుంబ కథని తెరపైకి తీసుకొచ్చారు వెంకీ అట్లూరి. తన శైలి క్లాస్, పరిణతితో కూడిన రచనతో సూర్యలోని క్లాస్ నటుడిని ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకి హైలైట్. హీరో హీరోయిన్ల మధ్య వయసు తేడా, సరోగసీ ద్వారా కన్న బిడ్డతో ముడిపడిన భావోద్వేగాలు ఈ కథకు కొత్తదనం తీసుకొచ్చాయి. సంజయ్ – మ్యాడీ కలిసినప్పటి నుంచి సినిమాలో సందడే సందడి. ముఖ్యంగా సంజయ్ తల్లితో కలిసి మ్యాడీ చేసే అల్లరి చాలా బాగుంటుంది. కొన్ని సున్నితమైన సన్నివేశాల్ని దర్శకుడు డీల్ చేసిన తీరు చాలా బాగుంటుంది. సూర్య, మ్యాడీ బంధం ఏ తీరానికి చేరుతుందన్న ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్ధం మొదలవుతుంది. అయితే, కోర్ట్ సన్నివేశాలు, ఆ తర్వాత చోటు చేసుకునే నాటకీయ పరిణామాలతో వచ్చే సీన్లు పెద్దగా ఆకట్టుకోకపోగా కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే రాధిక పాత్ర నేపథ్యంలో వచ్చే మలుపుతో కథ అనూహ్యంగా మరో దారిని తీసుకుంటుంది. దాంతో సినిమా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. అంజలీదేవి (రవీనా టాండన్), ఆమె కూతురు, తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాల్లో కొన్ని భావోద్వేగాలు, నాజర్ పాత్రతో కొంత హాస్యం పండటం సినిమాకి కలిసొస్తుంది. ఈ కథకు ముగింపు కూడా క్లాస్‌గానే ఉంటుంది. ఇలాంటి కథలకు ఇదే సరైన ముగింపు అనిపిస్తుంది కానీ, మరింత హంగామా కోరుకునేవాళ్లకు అది సంతృప్తిని ఇవ్వకపోవచ్చు. సూర్యలోని క్లాస్ నటుడిని పూర్తిగా వాడుకున్న సినిమా ఇది. ఆయన పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. మ్యాడీగా మమిత బైజు నటన ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలం. విజువల్స్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు వెంకీ రచన, మాటలు చాలా బాగున్నాయి.

# 16న ఇరుముడి ప్రీరిలీజ్ వేడుక

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.







# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది నటుడు యశ్ ప్రశంసలు

సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.



# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక

టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్

టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. లాంచింగ్ రోజే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.




Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajjularamaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com